సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 26 । అక్టోబర్ । 2024



న్యూస్‌రీల్

పొలం బాట పట్టిన పాలిటెక్నిక్ విద్యార్థులు


ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న విద్యార్థులు

చింతపల్లి: స్థానికవ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం పొలం బాట పట్టారు. స్వయంగా ఘన జీవామృతం ఎరువును తయారు చేశారు. ప్రతి ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మూడో సెమిస్టర్ ప్రాక్టికల్స్‌లో భాగంగా స్వయంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తారు. ఈ ఏడాది సాగుచేసిన పంటలకు అవసరమైన ఘన జీవామృతాన్ని కళాశాల టీచర్ అసోసియేట్ కె.బాలాజీనాయుడు పర్యవేక్షణలో తయారు చేశారు. ఈ సందర్భంగా బాలాజీ నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేపట్టడంలో మంచి ఫలితాలను సాధిస్తున్నారన్నారు.

తంగేడు దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న దుంగలు

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ దొడ్డవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన 74 తంగేడు దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు పెదవలస రేంజర్ శివరజని శుక్రవారం తెలిపారు. సిబ్బందితో కలిసి సాధారణ తనిఖీలు చేస్తున్న సమయంలో దొడ్డవరం సమీపంలో రూ.17 వేల విలువ చేసే తంగేడు దుంగలను ఒక చోట నిల్వఉంచిన విషయం తెలిసిందన్నారు. వెంటనే స్వాధీనం చేసుకుని కలప డిపోకు తరలించినట్టు ఆయన చెప్పారు.

కూనవరం నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సు


కూనవరం నుంచి విజయవాడకు నడుపుతున్న బస్సు

కూనవరం: ప్రజల అభ్యర్థన మేరకు విజయవాడ నుంచి కూనవరానికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఎట్టకేలకు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట గ్రామానికి నడుస్తున్న ఆర్టీసీ సర్వీసును శుక్రవారం కూనవరం మీదుగా విజయవాడ వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. ఈ సర్వీస్ రాత్రి 8.30 గంటలకు కూనవరం నుంచి బయలుదేరి భద్రాచలం, కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళుతుందని విజయవాడ డిపో మేనేజర్ శర్మ తెలిపారు. విజయవాడలో రాత్రి 10.15 గంట లకు బయలుదేరి తెల్లవారుజామున 3.00 గంటలకు భద్రాచలం చేరుతుందని, అక్కడి నుంచి 4.00 గంటలకు కూనవరం వస్తుందన్నారు. కూనవరం నుంచి చట్టి మీదుగా కుంట వెళుతుందని తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


పీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోల ఆదేశాల మేరకు మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఆరోగ్య పర్యవేక్షకులు వరలక్ష్మి, సరోజిని, ఝాన్సీరాణి, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాఫీ కొనుగోలులో దళారుల దందా

- పండ్ల దశలోనే కొనుగోలుకు యత్నాలు
- నష్టపోతామని రైతుల ఆవేదన

ఏటా కాఫీ రైతు కష్టం దళారుల పాలువుతోంది. దిగుబడులకు సరైన ధర పొందడంలో గిరిజనులు దగా పడుతున్నారు. దీంతో రైతుల కంటే... దళారులకు కాలు కదపకుండా ఉన్నచోటే కాసుల పంట పండుతోంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకునేందుకు ఈ ఏడాది కూడా దళారులు, వ్యాపారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బేరసారాలు ప్రారంభించి దందాకు తెరలేపారు.


కాఫీ పండ్లతో గిరి మహిళలు


కాఫీ పండ్లు సేకరిస్తున్న మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ ఏడాది కాఫీ మొక్కలు విరగ్గాసాయి. కాఫీ గింజల సీజన్ కావడంతో దళారులు, వ్యాపారులు రైతులతో బేరసారాలు ప్రారంభించారు. నవంబర్ నుంచి కాఫీ పండ్ల సేకరణకు గిరిజన రైతులు సిద్ధమవుతున్న తరుణంలో పండ్ల దశలోనే కొనుగోలుకు వ్యాపారులు పైరవీలు ప్రారంభించారు. గిరిజన సహకార సంస్థ పల్పింగ్ అనంతరం పార్చిమెంట్ గింజలను కిలో రూ.285 ధరతో కొనుగోలు చేయాలని ఇటీవల నిర్ణయించింది.

● ఏటా రైతుల నుంచి పార్చిమెంట్, చెర్రీ, రొబస్టాను గిరిజన సహకార సంస్థతో పాటు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతపల్లి మ్యాక్స్ సంస్థ కేవలం కాఫీ పండ్లను మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఇవికాకుండా మరో ఎనిమిది రైతు ఉత్పత్తిదారులు సంఘాలు కూడా వ్యాపార రూపంలో సేకరిస్తున్నాయి. జీసీసీ మాత్రమే ముందుగా మద్దతు ధర ప్రకటించి, చెల్లిస్తోంది. పండ్ల దశలోనే కొనుగోలుకు చింతపల్లి మాక్స్ సంస్థ, వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో పాటు దళారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిజన రైతులకు అడ్వాన్స్ చెల్లిస్తూ తమకే విక్రయించాలని ఒప్పందం చేసుకుంటున్నారు. పండ్లు విక్రయించడం వల్ల నష్టమే వస్తుందని పలువురు రైతులు తెలిపారు.

కాఫీ పండ్లు కిలో రూ.44

దళారులు కాఫీని పండ్లను కొనుగోలు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. కిలో రూ.40 నుంచి రూ.44ధరతో పండ్ల కొనుగోలుకు గ్రామ స్థాయిలో పైరవీలు చేస్తున్నారు. చింతపల్లి మాక్స్ సంస్థ కూడా ఈఏడాది కిలో కాఫీ పండ్లను రూ.44 ధరతో కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. అయితే ఈ ధర గిట్టుబాటు కాదని కాఫీ రైతులు ఘోషిస్తున్నా ఐటీడీఏ అధికారులకు పట్టడం లేదు.

కాఫీ రైతులకు నష్టమే



కాఫీ పంటను పండ్ల దశలోను చింతపల్లి మ్యాక్స్,ఇతర ప్రైవేట్ సంస్థలు, దళారులు తక్కువ ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులకు నష్టం వస్తుంది.పార్చుమెంట్ కాఫీ గింజల తయారీ ద్వారానే రైతులకు లాభాలు వస్తాయి. కేవలం ఎర్రని పండ్లను కొనుగోలు చేయడంతో కాఫీ రైతులకు అన్యాయం జరుగుతుంది. – పాలికి లక్కు, కాఫీ రైతుల సంక్షేమ సంఘం నేత, పాడేరు

జీసీసీ ద్వారా గిట్టుబాటు ధర



ఈఏడాది ఏజెన్సీలో గిరిజన రైతుల కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. .గిరిజన ప్రజాపతినిధులు,అధికారుల సమక్షంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అపెక్స్ కమిటీ సమావేశం కాఫీ కొనుగోలు ధరలను నిర్ణయించింది.పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285తో కొనుగోలు చేస్తున్నాం.
– ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

పాడేరు : ప్రజల నుంచి వస్తున్న అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. అర్జీలు స్వీకరించిన 24 గంటల్లో వైబ్‌సైట్లలో పరిశీలించాలని, లేకపోతే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌లతో కలిసి 166 అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా రహదారుల నిర్మాణం, సీసీరోడ్లు,డ్రైనేజీల ఏర్పాటు, తాగునీటి సమస్య, అటవీ హక్కు పత్రాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎక్కువ మంది అర్జీలు సమర్పించారు. బ్యాటరీతో నడిచే మోటర్ సైకిల్ అందజేయాలని చింతపల్లికి చెందిన కోమర్తి లక్ష్మణరావు అనే దివ్యాంగుడు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కార విషయంలో అధికారులు జవాబుదారీగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ మురళి, టీడబ్ల్యూ ఇన్‌చార్జ్ డీడీ రజని, టీడబ్ల్యూ పంచాయతీరాజ్ ఈఈలు జి.డేవిడ్‌రాజు, వేణుగోపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంజినీరింగ్ పనులు పూర్తి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం


మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలో చేపట్టిన ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. పీవో తన చాంబర్‌లో శుక్రవారం సెక్టార్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ, నాబార్డు ద్వారా చేపట్టిన పనుల్లో ఎన్నింటిని పూర్తి చేశారు, ఎన్ని ప్రారంభించాల్సి ఉంది వంటి వివరాలు తెలుసుకున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, మొక్కల పంపిణీపై సమీక్షించారు.రబ్బరు ప్లాంటేషన్ గురించి ఉద్యానవన శాఖ అధికారులతో చర్చించారు. ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఎంత మందికి సోకింది. హెల్త్ కార్డులు ఎంతమందికి జారీ చేశారు. వైద్య పరీక్షలు ఎంత మందికి చేశారు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఏజెన్సీలో క్షయ వ్యాధిపై సమీక్షించారు. క్షయ నిర్మూలనకు చేస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నారు. విద్యశాఖపై సమీక్షించి, మార్గదర్శి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు దిశ నిర్దేశం చేయాలని సూచించారు. వెలుగు ద్వారా మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీవో డి.ఎన్.వి. రమణ, డీడీ విజయశాంతి, పీహెచ్‌వో చిట్టిబాబు, సీడీపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

అరకులోయ గురుకుల విద్యార్థి మృతి

- వైస్ ప్రిన్సిపాల్ కొట్టడం వల్లేనని అంటున్న తల్లిదండ్రులు
- శరీరంపై గాయాలు లేవని అరకులోయ డాక్టర్ వెల్లడి
- లివర్, కిడ్నీ సమస్యలతో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారంటున్న గురుకుల సిబ్బంది


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)


కేజీహెచ్ ఆవరణలో రోదిస్తున్న మృతుడి తల్లి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

అరకులోయ టౌన్: స్థానిక ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో పదవతరగతి చదువుతున్న బడ్నాయిక్ ప్రవీణ్‌కుమార్ (15) అనే విద్యార్థి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అనారోగ్య సమస్యల కారణంగా మరణించినట్టు గురుకుల సిబ్బంది చెబుతుండగా, వైస్ ప్రిన్సిపాల్ కొట్టడం వల్లే మృతిచెందాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ పోలాపుట్టు గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ దసరా సెలవుల అనంతరం స్వగ్రామం నుంచి ఈ నెల 18న పాఠశాలకు వచ్చాడు. 19వ తేదీ ఉదయం స్టడీ క్లాస్‌కు రాకపోవడంతో వైస్ ప్రిన్సిపాల్ రామ నరసింహం మందలించారని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఆ తరువాత అనారోగ్యంతో బాధపడుతున్న ప్రవీణ్‌కుమార్‌ను 21న స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. డెంగ్యూ నెగిటివ్ వచ్చినా ప్లేట్‌లెట్స్ 30 వేలకు పడిపోయాయని, నోటి నుంచి రక్తం పడడంతో కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము సూచించారు. అయితే విద్యార్థి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని ఆయన చెప్పారు. వైద్యుల సూచన మేరకు మంగళవారం విశాఖకు తరలించి, అపోలో ఆస్పత్రిలో పలు పరీక్షలు చేయించినట్టు గురుకుల సిబ్బంది చెప్పారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని చెప్పడంతో ప్రవీణ్‌కుమార్‌ను తిరిగి పాఠశాలకు తీసుకొచ్చామని, బుధవారం ఉదయం పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేశామని తెలిపారు. బాలుడికి లివర్, కిడ్నీ సమస్యలు ఉన్నట్లు కేజీహెచ్‌లో నిర్వహించిన పరీక్షల్లో తేలిందని వారు చెప్పారు. దీంతో బాలుడు మృతి చెందినట్టు తెలిపారు. కాగా విద్యార్థి తల్లిదండ్రులు నీలమ్మ, ఈశ్వరరావు మాత్రం వైస్ ప్రిన్సిపాల్ రామనరసింహ తమ కుమారుడి తలపై కర్రతో కొట్టడంతోనే అనారోగ్యానికిగురై మృతి చెందాడని ఆరోపించారు.

పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్

విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన అరకులోయ గురుకుల పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని ఆమె డిమాండ్ చేశారు.

కాఫీ కొనుగోలు లక్ష్యం.. రెండు వేల మెట్రిక్ టన్నులు


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్


హాజరైన అధికారులు

ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో మ్యాక్స్ సంస్థ ద్వారా ఈ ఏడాది రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ప్రతి మండలానికి నిర్దేశించిన మేరకు కాఫీ పండ్లను సేకరించాలన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో కాఫీ అధికారులు, లైజన్ వర్కర్లు, జీసీసీ అధికారులతో కాఫీ పండ్ల సేకరణపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తిగా పండిన కాఫీ పండ్లను మాత్రమే రైతులు సేకరించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మ్యాక్స్ సంస్థ రైతుల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. నూరు శాతం లక్ష్యాలను సాధించిన సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేస్తామని, 85 శాతానికి తక్కువగా సేకరించిన వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. టాటా, ఐటీసీ వంటి సంస్థలు కాఫీ కొనుగోలుకు ముందుకు వస్తున్నట్టు చెప్పారు. జీసీసీ ద్వారా అరాబిక పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.285, అరాబిక చెర్రీ కిలో రూ.150, రొబాస్టా రకం కిలో రూ.80లకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఐటీడీఏ మాత్రం కాఫీ పండ్లను మాత్రమే కిలో రూ.44 చొప్పున కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. రైతులకు బోనస్ చెల్లిస్తామని తెలిపారు. జి.మాడుగుల, జీకే వీధి మండలాల్లో కాఫీ పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7కోట్ల నిధులను విడుదల చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ప్రతి మండలంలో ఒక యూనిట్‌ను నెలకొల్పేందుకు జీసీసీ ప్రణాళికలను రూపొందిస్తుందని చెప్పారు. కాఫీ పండ్ల సరఫరా, సేకరణలో సమస్యలుంటే ఐటీడీఏ కాల్ సెంటర్ (ఫోన్ 08935250833), జీసీసీ కాల్ సెంటర్(ఫోన్ 7013070990)కు ఫోన్ చేయాలని తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు సహాయ సంచాలకులు రమేష్, ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్, జీసీసీ డీఎంలు సింహాచలం, దేవరాజ్, కాఫీ విస్తరణాధికారులు శ్రీరామ్మూర్తి,అప్పలనాయుడు పాల్గొన్నారు.

కాఫీ సేకరణ ధరలు

రకం	కిలో ధర (రూ.లలో)
అరాబికా పార్చిమెంట్	285.00
చెర్రి	150.00
రోబాస్టా	80.00
పండ్లు	44.00

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు

ఎస్పీ అమిత్ బర్దర్


ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పాడేరు : క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. పట్టణంలోని కుమ్మరిపుట్టు వద్ద గల ఏకలవ్య మోడ్రన్ స్కూల్, ఇంగ్లిష్ మీడియం పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పుడు ఉన్నతమైన ప్రణాళికను రూపొందించుకుని, దాన్ని సాకారం చేసుకునేలా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు, బాలల కోసం ఉన్న హక్కులు, చట్టాలతో పాటు విద్యా హక్కు చట్టంపై వారికి వివరించారు. చట్టప్రకారం విద్యార్థులను, బాలలను హింసించడం, కొట్టడం, వేధించడం నేరమన్నారు. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. విద్యార్థులకు మంచి భోజనంతో పాటు నాణ్యమైన బోధన అందించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పాఠశాలల యాజమాన్యాలకు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపులు తొలగించాలంటూ ఆందోళన


చింతూరులో ఆందోళన చేస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

చింతూరు: గుడి, బడికి సమీపంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలు తొలగించాలంటూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చింతూరులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుడి, బడికి సమీపంలో ఇప్పటికే రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని, మరో దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీంతోపాటు మద్యం దుకాణాలన్నీ ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరుకు మంజూరైన దుకాణమే కాకుండా మోతుగూడెం, చట్టిలో మంజూరైన దుకాణాలు సైతం చింతూరులోనే పక్కపక్కనే ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆ దుకాణాలను వెంటనే తొలగించాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ ఇంద్రజిత్ అక్కడకు చేరుకుని నాయకులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం లేని దుకాణాలను రెండు, మూడు రోజుల్లో తొలగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దాసరి రమణారెడ్డి, పయ్యాల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాసరావు, రామారావు, కాశి, సతీష్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

హిమాలయాల్లో సాహసం 10లో



క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి గ్రామాల సమస్యలు

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,జిల్లా ఉపాధ్యాక్షుడు పాంగి సింహాచలంతో పాటు పలువురు నాయకులు శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను విశాఖలోని ఆమె నివాసంలోని మర్యాదపూర్వకంగా కలిశారు. మండల సమస్యలను ఆమెకు వివరించి, వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని వివరించారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు కూటమి ప్రభుత్వ పాలనలో ముందుకు సాగడం లేదని గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. పాతకోట సర్పంచ్ పాటి చిన్నయ్య, నాయకులు ఉన్నారు.

482 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటరావు

జి.మాడుగుల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ (పాడేరు) ఆధ్వర్యంలో మండలంలో గాంధీనగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు ఆదేశాల మేరకు ఆప్తాలిమిక్ అధికారి డి.వెంకటరావు సుమారు 482మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. ఇందులో పది మంది విద్యార్థినులకు కళ్లద్దాలకు సిఫారసు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ జ్యోతిలాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్ దరఖాస్తుకు గడువు పెంపు

విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కే రామారావు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో సకాలంలో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు, స్టైఫండ్ కూడా పొందే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హిమాలయ పర్వత శ్రేణులు అత్యంత శీతల వాతావరణానికే కాదు.. ఎన్నో ప్రతికూలతలకు నిలయం. అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అలాంటి మంచు కొండలకు వెళ్లడం అంత సులభం కాదు. ప్రకృతి విసిరే సవాళ్లను తట్టుకొని నిలబడాలంటే మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో అవసరం. అలాంటి పర్వత శ్రేణుల్లో ట్రెక్కింగ్ చేస్తూ తమ సాహసాన్ని చాటుకుంది అమెరికాకు చెందిన 10 మంది భారతీయ సంతతి వైద్యుల బృందం. ఇందులో మన విశాఖ వాసి ఉన్నారు. ఈ బృందం 5,364 మీటర్ల (17, 598 అడుగులు) ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్(ఈబీసీ) ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.

– సీతమ్మధార

- మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన విశాఖ వాసి
- అమెరికాకు చెందిన భారత సంతతి వైద్యులతో కలిసి ట్రెక్కింగ్
- యూఎస్‌ఏలో ఆంకాలజిస్ట్‌గా సేవలు

హిమాలయాల్లో సాహసం

నక్కవానిపాలెం దరి కేఆర్ఎం కాలనీకి చెందిన డాక్టర్ వినయ్ కుమార్ అమెరికాలో ఆంకాలజిస్ట్. అమెరికాకు చెందిన 9 మంది భారతీయ సంతతి వైద్యుల బృందంతో కలిసి ఈ నెల 10వ తేదీన మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు బయలుదేరారు. ఈ ట్రిప్‌లో ప్రకృతి సోయగాలను వీక్షించడంతో పాటు అనేక అనుభూతులు పొందామని వినయ్‌కుమార్ తెలిపారు. మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేసుకున్న ఆయన గురువారం విశాఖ వచ్చారు. శనివారం అమెరికా వెళ్తున్న ఆయన శుక్రవారం 'సాక్షి'తో తన ఎవరెస్ట్ యాత్ర అనుభవాలు పంచుకున్నారు.

ఎన్నో అనుభూతుల సమ్మేళనం

'5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడానికి కఠినమైన మార్గంలో పయనించాం. ప్రతి రోజూ నాలుగు నుంచి ఎనిమిది గంటల పాటు హైకింగ్ చేస్తూ.. దూద్ కోసి నది ఒడ్డున

తల్లిదండ్రులు, సోదరుడితో డాక్టర్ వినయ్‌కుమార్

అనేక కిలోమీటర్ల పాటు మా ట్రెక్కింగ్ కొనసాగించాం. మధ్యలో ఎత్తైన కాలినడక వంతెనలు దాటుకుని.. సుందర దృశ్యాలను వీక్షిస్తూ ముందుకు సాగాం. ఈ క్రమంలో అనే సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ యాత్రకు ముందు ఏడాది పాటు వివిధ ఎత్తుల్లో ఉన్న పర్వతాలపై శిక్షణ తీసుకున్నప్పటికీ.. ఈ ట్రెక్ మాత్రం ఊహించిన దానికంటే చాలా సవాల్‌గా మారింది.'అని వినయ్‌కుమార్ వివరించారు.

ప్రకృతి అందాలకు ఫిదా

'ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ ప్రకృతి మార్గమే కాదు.. అక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు మాకు అవకాశం దక్కింది. అక్కడి ప్రజల జీవన విధానాలను ప్రత్యక్షంగా చూశాం. దారిలో అద్భుతమైన హియాలయ పర్వత సుందర మనోహర దృశ్యాలను చూసి పరవశించిపోయాం. అలా సముద్ర మట్టానికి 3,440 మీటర్ల ఎత్తులో ఉన్న నామ్చే బజార్‌కు చేరుకున్నాం. ఈ ట్రెక్ ఎంతో శ్రమంతో కూడినదే అయినా చుట్టూ ఉన్న అద్భుత సహజ సౌందర్యం, బృందంలోని సహచరుల పరస్పర సహకారంతో యాత్రను ఎంతో ఆనందదాయకంగా మార్చింది. తర్వాత 4,410 మీటర్ల ఎత్తులో ఉన్న తెంగ్‌బోచేకు చేరుకున్నాం. ఇక్కడ నుంచి పర్వత శిఖరాలు దగ్గరగా కనిపించాయి.' అని డాక్టర్ వినయ్ తెలిపారు.

శ్రమంతా మర్చిపోయాం..

ఉష్ణోగ్రతలు తగ్గి.. పైకి ఎక్కే కొద్దీ ట్రెక్ కష్టతరంగా మారింది. తలనొప్పి, తలతిరగడం ప్రారంభమైంది. అక్కడి టీ హౌస్‌లో సాధారణ మంచాలపై, రొట్టి, పప్పుతో శాఖాహార భోజనం చేసి నిద్రపోయాం. తర్వాత లోబుచెకు ఎక్కడం కఠినంగా మారింది. ఇది నిటారుగా ఉంది. దాదాపు 4,500 మీటర్ల ఎత్తులో ఉంది. నత్తల వేగంతో ఎక్కాం. టెక్కింగ్‌లో మా ఆఖరి స్టాప్.. 5,164 మీటర్ల

ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించిన డాక్టర్ వినయ్‌కుమార్

ఎత్తులో ఉండే గొరెక్‌షెప్ గ్రామం. అక్కడ ఆక్సిజన్ స్థాయిలు 51 శాతం మాత్రమే ఉన్నాయి. దాదాపు 17,000 అడుగుల వద్ద ఆక్సిజన్ కోసం పెద్ద పోరాటమే చేశాం. చివరగా 10వ రోజున ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడం గొప్పగా అనిపించింది. ఈ యాత్రలో మేం పడిన శ్రమ, భరించిన కష్టాలు.. అక్కడి ప్రకృతి అందాలను చూసి పొందిన అనుభూతుల్లో కొట్టుకుపోయాయనే చెప్పాలి. అద్భుతమైన హిమాలయ పర్వత దృశ్యాలు మా మనస్సుకు ఉత్తేజాన్ని ఇచ్చాయి. ఎన్నో అనుభూతులను మిగిల్చాయి. నా ఎవరెస్ట్ బేస్ క్యాంప్ విజయవంతం కావడంతో నా తల్లిదండ్రులు చాలా సంతోషించారు.'అని వినయ్‌కుమార్ ముగించారు. కాగా.. అతని తండ్రి రామచంద్రరావు ఏయూలో పనిచేసి పదవీ విరమణ చేశారు. తల్లి కమల ఏయూలో పీహెచ్‌డీ చేశారు. సోదరుడు వివేకానంద హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం రాజపురం(వీరగున్నమ్మపురం)నకు చెందిన వీరు విశాఖపట్నంలో స్థిరపడ్డారు.

4 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నాతవరం : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో తాండవ జంక్షన్‌లో శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆర్టీసీ బస్సు దిగి సంచరిస్తుండగా అనుమానం వచ్చి బ్యాగ్‌లు తనిఖీలు చేశామన్నారు. వారి వద్ద గంజాయి లభించిందన్నారు. కృష్ణ జిల్లా గొల్లపూడి గ్రామానికి చెందిన గుర్ల రాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు గ్రామానికి చెందిన బానోజు వీరన్న, విజయవాడ రూరల్‌కు చెందిన పట్టెం సురేష్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌ను తరలించామన్నారు. వారి వద్ద 4 కిలోల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గొందిపల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ గొందిపల్లి గ్రామంలో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య పరమైన సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని గ్రామస్తులకు సూచించారు.

ప్రసాద్ పథకం పనులు వేగవంతం

రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

ప్రసాద్ పథకం పనులపై సమీక్ష నిర్వహిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అధికారులకు సూచించారు. సింహాచలం దేవస్థానంలో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం సింహగిరిపై కాటేజీలో సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, టూరిజంశాఖ, సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రూ.54కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో సింహాచలం దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పనులు వేగవంతంగా చేయాలని టూరిజనం శాఖ అధికారులను ఆదేశించారు. సింహగిరిపై టూరిజం శాఖ నిర్మించే క్యూకాంప్లెక్స్‌పై మరో రెండు అంతస్తులు అదనంగా దేవస్థానం నిర్మించేందుకు ప్రణాళిక వేస్తున్నట్టు చెప్పారు. కొండదిగువ పుష్కరిణి సత్రం బిల్డింగ్‌పై కూడా అదనంగా అంతస్తుల నిర్మానానికి సంబంధించి కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. యాంపీ థియేటర్, యాగశాల నిర్మాణాల విషయంపై చర్చించారు. టూరిజం శాఖ ఈఈ రమణ, ఏఈ మదన్‌మోహన్, సింహాచలం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

అనంతుడి ఆలయ శిఖర పనుల పరిశీలన

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులను వచ్చే నెల 20 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆర్. సత్యనారాయణ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గిరిపై జరుగుతున్న పనులు ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 30 తేదీన అనంత పద్మనాభ స్వామి గిరి మెట్లు పంక్తిపై దీపోత్సవం నిర్వహించనున్నందున పది రోజుల ముందుగా శిఖరం పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ఆలయానికి ఎంత భూమి ఉంది, ఎంత భూమికి శిస్తులు వసూలు అవుతున్నాయో ఈవో నానాజీ బాబును అడిగి తెలుసకున్నారు. పంచాయతీ రాజ్ నిధులు రూ.5కోట్లతో చేపడుతున్న ఘాట్ రోడ్డు అభివద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు.

మందుబాబులకు జైలు, జరిమానా

చావులమదుం జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న హార్బర్ ట్రాఫిక్ పోలీసులు

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు 10 నుంచి 15 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ఫోర్త్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు హార్బర్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు పర్యవేక్షణలో జ్ఞానాపురం జంక్షన్‌లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మంది వాహనచోదకులు పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. మేజిస్ట్రేట్ సి.నారాయణమూర్తి సెక్షన్ 125 ఎంవీ యాక్ట్ ప్రకారం ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ ఎస్.రవిశంకర్ పట్నాయక్, లారీ డ్రైవర్ మైలాల సాహులకు 15 రోజుల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. మరో ఆటో డ్రైవర్ పితాన కాశీకి 10 రోజుల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, మిగిలిని వారికి రూ.10 వేలు చొప్పున రూ.1,50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి గిరిజనుడు గల్లంతు

గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

ముంచంగిపుట్టు : ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న డుడుమ జలాశయం దిగువన చేపల వేటకు వెళ్లి గిరిజనుడు గల్లంతైన విషయం ఆలస్యంగా తెలిసింది. వివరాలిఆల ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా నందపూరు బ్లాక్ ఒనకడిల్లీ పంచాయతీ కుదుగూడ గ్రామానికి చెందిన శుక్ర గొల్లోరి(53) గురువారం సాయంత్రం డుడుమ జలాశయం దిగువ ప్రాంతం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం సమీపంలో చేపల వేట చేస్తున్నాడు. వలకు భారీ చేప పడడంతో చేప లాగేయడంతో నదిలో శుక్ర గల్లంతయ్యాడని అతనితో వెళ్లిన వ్యక్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాచ్‌ఖండ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీంతో పోలీసులు లంతాపుట్టు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం నుంచి మాచ్‌ఖండ్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మా చ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో సమీప నదిలో విస్తృతంగా గాలించారు. అయితే శుక్ర ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడడంతో

నది ప్రాంతంలో గాలింపు చేస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

గాలింపు నిలుపుదల చేశారు. శనివారం ఉదయం నుంచి తిరిగి గాలింపు చేపడతామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. రెండేళ్ల క్రితం శుక్ర సోదరుడు గొల్లోరి సోమర సైతం ఇదే నదిలో చేపల వేటచేస్తూ గల్లంతై మృతి చెందాడు. దీంతో కుటుబ సభ్యులు నది ప్రాంతంలో బోరున విలపిస్తున్నారు.

గొల్లోరి శుక్ర (ఫైల్)

గిరిజనులకు గొడుగుల పంపిణీ

కొయ్యూరు: దివంగత మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం డౌనూరు సంతలో 200 మందికి మాజీ ఎంపీ జి.మాధవి గొడుగులు పంపిణీ చేశారు.ముందుగా తండ్రి దేముడు చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ తండ్రి అడుగు జాడల్లో నడుస్తున్నట్టు తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవలు అందించిన గొప్పవ్యక్తిగా దేముడు నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు,డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు,డౌనూరు,మూలపేట సర్పంచ్‌లు పొట్టిక భవానీ, రావుల వెంకటలక్ష్మి, నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె. శివప్రసాద్,డైరెక్టర్ సురేష్ పట్నాయక్, నాయకుడు పెట్ల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ చేస్తున్న అరకు మాజీ ఎంపీ మాధవి తదితరులు

కలెక్టర్‌కు ప్రజాప్రతినిధుల వినతి

కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన సర్పంచ్‌లు

గూడెంకొత్తవీధి: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీల గృహాలకు ఇస్తున్న నిధులు సరిపోవడం లేదని, దీన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరుతూ గూడెం కొత్తవీధి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు శుక్రవారం కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈనెలలో విడుదల చేసిన ఉపాధి హామీలో వచ్చిన సీసీ, బీటీ రోడ్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. మెటీరియల్ చెల్లింపుల నగదును ఉపాధిహామీ ఖాతాల్లోనే ఉంచాలన్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రలకు వేతనాలు పెంచాలని, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు కేటాయించాలని కోరారు. గతంలో మాదిరిగా పంచాయతీలకు మేచింగ్ గ్రాంటు ఇవ్వాలని కోరారు. సర్పంచ్‌లు బి.లక్ష్మి, నాగులమ్మ, కొర్ర సుభద్ర, రామకృష్ణ, నాయకులు రామకృష్ణ, వెంకట పూర్ణిమ, వెంకటరావు, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

హుకుంపేట: పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ చెప్పారు. మండలంలోని కొంతిలి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పంచాయతీ రాజ్ నిధులు రూ.20లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. పీఆర్‌జేఈ సంజీవ్, ఉప సర్పంచ్ పాముల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొంతిలిలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అరకులోయ టౌన్: అరకులోయ సీ-కాలనీకి చెందిన కొర్ర శ్రీను అనే పెయింటర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శ్రీను కుటుంబానికి తేజావల్లి పెయింటర్ అసోసియేషన్ ఆర్థిక సాయంతో రూ.10 వేలు అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఆయా నగదును సంఘం ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కొండలరావు, దాసు, గోపి, రాజేంద్ర, సుంకరమెట్టు సర్పంచ్ చిన్నబాబు చేతుల మీదుగా అందించారు. ఉమమహేశ్వరరావు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సంఘంతో పాటు సీఐటీయూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు వీర్రాజు, సుధా, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న సీఐటీయూ నాయకుడు ఉమామహేశ్వరరావు తదితరులు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం

- ఆ దిశగా రైతులకు అవగాహన
- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

అనకాపల్లి: నూతన సాంకేతికతో సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద సబ్ డివిజన్ కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం, ఆర్‌వైకెవై, ఆత్మ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ విధానం, యాంత్రీకరణ అంశాలపై క్షేత్రస్థాయిలో తెలియజేసి వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు పి. శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన (నేషనల్ పెస్ట్ సర్వైలెంట్ సిస్టం) ఆప్‌ను రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక శాస్త్రవేత్త డాక్టర్ సరిత మాట్లాడుతూ వరి పొలంలో తెగుళ్లు, పురుగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వరిలో పొడ తెగులు, ఆకుముడత నివారణకు హెక్సాకొనజోల్ అనే మందును రెండు మిల్లీలీటర్ల లీటరు నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో బీపీటీ-5204 రకానికి సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నందున లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటకు ఎకరానికి 25 కేజీలు యూరియా, 15 కేజీలు పొటాస్ వినియోగించాలన్నారు. బ్యాక్టీరియా ఎండు (పండా ఆకు) తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు, ఆయా మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో కంకినల్లి నివారణకు ప్రత్యేక చర్యలు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో కంకినల్లి వచ్చే అవకాశం ఉన్నందున ప్రోఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో సుడిదోమ, పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున అసిఫేట్ 1.5 గ్రాములు, ప్రోపికొనజోల్ 1 మి.లీ.లీటరు నీటిలో పిచికారి చేసి నివారించవచ్చన్నారు. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, తల్లి పురుగు కనిపిస్తే ట్రైకోగ్రామా గుడ్లు పరాన్న జీవిని ఎకరాకు 20 వేల చొప్పున విడుదల చేయాలన్నారు. రసాయనిక మందులు కాకుండా జీవ నియంత్రణ చేసే రైతులు బేరియా బాసియాన(బిబి5ఎ)ను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అంకురం దశలో ఎకరాకు 25 కిలోల యూరియా 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌పై పాటుగా తగినంత తేమ ఉన్న ఉప్పుగుల్లు వేసుకోవాలని సూచించారు. ఉలవ సాగుకు ఇది సరైన సమయం అన్నారు. ఖాళీ పొలాల్లో అధిక దిగుబడినిచ్చే ఉలవ రకాలైన పీడీఎం-1, క్రీడ 1-18 ఆర్, ఏటీపీహెచ్‌జీ-11ను వెదజల్లే పద్ధతిలో 12-15 కిల్లోల వరుసలలో గొర్రుతో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు చొప్పున వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ దూరంలో విత్తుకోవాలన్నారు. ఖాళీ పొలాల్లో విత్తనం కోసం పండించే జనుము సాగు చేసుకోవచ్చన్నారు.